౧౩

# విరామ సంకేతం

పొద్దున లేచినప్పటినుంచీ టైమయిపోయిందనే అనుమానం. పక్కమీంచి లేచింది మొదలూ పరుగు. తొందర తొందరగా మొహం కడుక్కుని, కాఫీ గొంతులో పోసుకుని, వార్తాపత్రిక శీర్షికలు చదివి, స్నానం అయిందనిపించుకుని, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని బస్సు స్టాండుకు పరిగెత్తడం. అప్పుడుమరి—టైమయిపోయింది.

బస్సుస్టాండ్ కిటకిట లాడుతూంది. బస్సులో జనం సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆఫీసులకు వెళ్ళే ఉద్యోగులు, ఉద్యోగినులు, దుకాణాలకు వెళ్ళే వ్యాపారులు, స్కూళ్ళకు వెళ్ళే విద్యార్థులు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు— అందరికీ టైమయిపోయింది. ఎదురుగుండా మేడమీద గదిలో కుర్చీలో కూర్చుంది శ్రీమంతుని భార్య. ఆవిడ టైమయిపోలేదు. శీతకాలం తొమ్మిదైనా పొగమంచు తెర విడలేదు. ఇంకా తొమ్మిదేనా అయింది. వెధవ తొమ్మిది! టైం మారాలి. మనిషి అంతరిక్షంలో ప్రయాణం చేసే రోజులొచ్చాయి. కాలమానం మారాలంటున్నారు శాస్త్రజ్ఞులు.

పొగ మంచులో కారులూ, బస్సులూ, ఆటోరిక్షాలు స్పీడుగా వెళ్తున్నాయి. స్పీడు లిమిట్ 10 మైళ్ళట! ఇంతోటి స్పీడుకి లిమిటొకటా? దీనిని స్పీడనడం ఫ్రాడ్. స్పీడంటే రాకెట్ దే స్పీడు. సెకండుకు 11 కిలోమీటర్లట!

నిసుడు మా తాతగారి పల్లెటూరు వెళ్ళితే అక్కడ ఆటోలు లేవు. కాలినడక, లేదా ఎడ్లబళ్ళు. అమ్మొయ్యో!

అక్కడున్న నాలుగు రోజులూ నాలుగు యుగాలు! పై మెప్పటికీ కాదు. ఆ మధ్య అమెరికానుంచి ఒక ప్రముఖుడు ఢిల్లీకి వచ్చి "అమ్మయ్య!" ప్రాణం లేచొచ్చిందన్నాట్ట. ఇక్కడ కాలానిది తాబేలు నడకట న్యూయార్కు నుంచి వచ్చిన వాడికి ఢిల్లీ మా తాతగారి ఊరు. అతనికి టాంగాలు (టాంగాలంటే గుర్రబ్బళ్ళు) నచ్చాయట. జీవితతీవ్రగమనానికి టాంగాలు బ్రేకులట. నాలుగు టాంగాలు అమెరికాకు పట్టుకు పోతాడట. నన్నడిగితే పోతులబళ్ళను రికమండ్ చేస్తాను.

వచ్చింది, వచ్చింది రాకసిలా వచ్చి నిలబడిందిబస్సు. అంతవరకూ క్రమశిక్షణతో బుద్ధిమంతుల్లాగ వరసగా నిలబడ్డ వారంతా ఒక్కసారిగా బస్సుమీద విరుచుకుపడ్డారు. బస్సు మనుష్యుల మీదొచ్చి పడేకంటె మనుష్యులు బస్సు మీద పడడం నయం! అబ్బ! దొమ్మి! దొమ్మి! "మిస్టర్ కండక్టర్! క్యూలో వున్నవాళ్ళనే తీసుకో."

"ఏమిటీ అన్యాయం! ఛ! బస్సుస్టాండ్ దగ్గర మహా అన్యాయం సుమండీ!"

—మరోకచోట న్యాయం వుండి ఏడిసినట్టు!

"లేదు, వీల్లేదు-ఇప్పటికే ఓవర్‌లోడయింది."—ఏమిటయ్యా ఓవర్‌లోడయింది?

"మిస్టర్ కండక్టర్ నీ పుణ్యముంటుంది, ఎక్కనివ్వవయ్యా, టైమైపోయింది."

"అన్నట్టు టైమెంతండీ?"

తొమ్మిదిన్నరే—కొంపమునిగింది. ఇంకా అరగంట

వ్యవధి. నిత్యం కొట్టుకుంటున్న గుండెలాగ వెధవవాచీ టిక్ టిక్ మని కొట్టుకుంటూనే వుంది. దాన్నెవరాపగలరు?

అమ్మయ్య! ఎలాగైతేనేం ఇక్కడికో మహావిజయం సాధించాను

ఒక మూల ఆఫీసులకెళ్ళే గుమస్తాలు— ఎక్కుపెట్టిన బాణాల్లాగ చొచ్చుకొస్తున్న స్త్రీ పురుషులు—మరొకమూల వ్యాపారులు, విద్యార్థులు డబ్బులిచ్చి టిక్కెట్లు కొంటున్నారు.

"ఇంతకీ కొత్తగావచ్చిన ఆఫీసరు మంచివాడు సుమా" అంటున్నాడు గుమస్తా

"చెడ్డవాడైతే మాత్రం మనల్నేం చెయ్యగలడు లేవోయ్, బాగున్నవాళ్ళని చెడగొట్టాలి గాని."

"కాన్ఫిడెన్షియల్ రిపోర్టుకు కన్నం పెట్టేడనుకో, ఏమవుతుంది?"

"మహా అయితే ఉద్యోగం ఊడుతుంది, అంతేనా? ఊడనీ, సలిపేదంతం రాలిపోతేనే నయం" అంటూ చిల్లర లెక్కెట్టుకుంటున్నాడు. "కండక్టర్, ఈ పావలా చెల్లదయ్యా."

"రాత్రి తొమ్మిదో గంటకు దుకాణం మూసేయాలా మరి, అందుకని..." అంటున్నాడు బట్టలవ్యాపారి. తెల్లారిందో లేదో అప్పుడే రాత్రి సంగతి ఆలోచన. పరీక్ష ప్యాసవగానే ఉద్యోగం సంగతి. ఉద్యోగం కాగానే ప్రమోషన్ సంగతి. తరవాత బ్యాంక్ బేలన్స్ ఇల్లుకట్టిచూడు, పెళ్ళి చేసిచూడు, రిటైర్‌మెంట్ ఎక్స్‌టెన్షన్. బ్రేక్ పడి ఎక్కడో బస్సు నిలబడిపోతుంది.

బస్సులో రద్దీ. ఎవరో అమ్మాయి చాల అందంగా వుంది. నేలపడేసుకున్న చిల్లరడబ్బులకోసం వెదుకుతూంది. "ఏయ్, కళ్ళు కనపడవ్వా, ఏమిటా తోసుకురావడం?"

"బస్సులో రద్దీగావుంటే."

"ఊరుకోవయ్యా ఆడవాళ్ళతో పోట్లాడతావేమిటి?"

బస్సుకు స్పీడులేదు. ఎండాకాలంటే మేఘాలు వెనక్కి పరిగెత్తుతున్నట్టు కనిపించడంలేదు. డ్రైవరు కునుకుపాట్లు పడుతూ వుండవచ్చును. గానుగలాగ ఒకే రూట్‌లో పగల్లా తిరిగే బస్సు, రూట్ మార్చి యింకోదారిన వెళ్ళకూడదు. దానివల్ల అందరి రూటూ మారిపోతుంది, రొటీన్ మారిపోతుంది. డ్రైవరు బస్సు అడ్డంగావచ్చిన సైకిలిస్టును తిడుతున్నాడు. సైకిలిస్టు తనదారి అడ్డంగావచ్చిన పాదచారిని తిడుతున్నాడు, పాదచారి అందరినీ కలిపి తిడుతున్నారు. సర్క్యూట్ పూర్తయింది.

మధ్యలో స్టాపులు, ఎక్కేవాళ్ళూ దిగేవాళ్ళూ. పాత వాళ్ళు పోయి కొత్తవాళ్ళొస్తారు, పోయినవాళ్ళు మరి తిరిగి రారు.

ఛ! ఏమిటీ రొటీను? డ్రైవరుకు తల నొప్పిగావుంది. రోజూ పగల్లా వెళ్ళిన రూటులోనే వెళ్ళడమా? చూసిన మేడలే చూడడమా? రోజూ యీ ఈసురోమనే మొహాలే ప్రత్యక్షమా? తిప్పేడు స్టీరింగ్, తప్పించాడు రూట్, ఎక్కించాడు స్పీడ్!

"ఒహో, స్పీడు, స్పీడు, ఏమి స్పీడు!

వహా వా! మజాగావుంది రైడు!
ఏయ్ తప్పకో తప్పకో ఆ సైడు!
లేకపోతే తప్పదు హాస్పిటైడు!"

డ్రైవరు పాట వినుకుంటున్నాడు.

"కండక్టర్, వాటీజ్ దిస్? ఎక్కడికిలా? ఆఫీసులకు లైటయిపోతూవుంటే ఏమిటీ చక్కర్లు?"

"డ్రైవర్, ఏమిటిదంతా? ఎక్కడికిలా? నీకు మతి పోయిందేమిటి?"

మాటలు వినిపించడం లేదు. బస్సు ఆగలేదు. రివ్వున రాకెట్‌లా దూసుకుపోయింది. జనమంతా లేచినిలుచున్నారు. డ్రైవరుకు మతి భ్రమణా అన్నారు. ఏక్సిడెంటు తప్పదన్నారు. పొద్దున్నే లేచి ఎవరి ముహం చూచామో ననుకున్నారు. ఆఫీసులకు లేటు తప్పదనుకున్నారు. చీవాట్లు తినడానికి సిద్ధపడ్డారు.

ఎలాగైతేనేం, బస్సు ఊరిబయట కొండదగ్గర మైదానంమీద నిలబడింది. కొండమీద జరుగుతూంది బ్రహ్మాండమైన జాతర, ఎత్తైన గొడుగులాగ, నీలమేఘంలాగ! జనం, జనం. ఇసకవేస్తే రాలదు. పల్లెస్త్రీలు, పురుషుల కిలకిల నవ్వులు, కేరింతలు, ఆటలు, పాటలు - గాజుల గలగలలు, మువ్వల మ్రోతలు, కిర్రుజోడుగలు - నృత్యాలు, గారడీలు, మోళీలు, రంకులరాట్నాలు! ఆనందంతో, నవ్వులతో చిందులు తొక్కుతున్నారు జనం! కన్నులపండువుగా యీ కోలాహలం! ఎక్కడా అంతు కనిపించడం లేదు దీనికి - మహార్ణవానికి!

ఎవరికీ టైమ్‌తో నిమిత్తం లేదు, కాలం దూరాలిక్కడ పని చెయ్యడం లేదు. ఏమిటీ తిరనాళ!

*　　　*　　　*

"దఫ్తర్, దఫ్తర్ - దిగండి, దిగండి"-అందరూ బస్సు దిగుతున్నారు. వారి కళ్ళజోళ్ళ అద్దాలమీద ఆఫీసుభవనాల ప్రతిబింబాలు, నీడలు కనిపిస్తున్నాయి.

"తొందరగా దిగవయ్యా, ఏమిటా పరధ్యాన్నం, టైమవుతూంటే."

అమ్మయ్య! పదికి యింకా ఒక నిముషముంది. ఫరవా లేదు, ఆఫీసుకు టైముకు చేరుకున్నాను. ఇది ఇవాళ సాధించిన రెండవ విజయం.